ప్రజాశక్తి

గురువారం 9 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఎపి లక్ష్యాలకు అండగా ఉంటాం

బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

- విశాఖ సభలో ప్రధాని మోడీ
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- నగరంలో రోడ్డుషో

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ, ఆరిలోవ, భీమునిపట్నం విలేకరులు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యాలకు అండగా ఉంటామని, అవసరమైన సహకారం అందిస్తామని దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. విశాఖలోని ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో కూటమి పార్టీల ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం జరిగిన 'ప్రజావేదిక' సభలో తెలుగులో తన ప్రసంగం ప్రారంభిస్తూ ప్రధాని పై పలుకులు పలికారు. విశాఖ పర్యటనలో భాగంగా ప్రధాని తొలుత ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం సాయంత్రం 4.50 నిమిషాలకు సిరిపురం వద్దగల వెంకటాద్రి వంటిల్లు నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మోడీ రోడ్డుషో నిర్వహించారు. ఆయన పక్కన చంద్రబాబు, పవన్, పురంధరేశ్వరి ఉన్నారు. అనంతరం ఎయు గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మోడీ మాట్లాడారు. విశాఖలో 10 ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం ద్వారా ఎపి అభివృద్ధికి కేంద్రం ముందుకొచ్చిందన్నారు. సభా వేదికపై మాట్లాడిన చంద్రబాబు, పవన్‌లు మోడీని ఆకాశానికెత్తేశారు. ఇదిలా ఉండగా మోడీ అనకాపల్లి జిల్లా నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కుకు రూ.1876 కోట్లతో, పూడిమడకలో ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును రూ.1.85లక్షల కోట్లతో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రధాన మిగతా 2లో..

రోడ్డు షోలో అభివాదం చేస్తున్న మోడీ, చిత్రంలో బాబు, పవన్

విశాఖ స్టీల్‌కు ద్రోహం..
మిట్టల్‌కు దాసోహం

- బట్టబయలైన కూటమి స్వభావం
- 'ప్రజావేదిక' సభలో మోడీపై పొగడ్తల జల్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్న మోడీ

'కూటమి' పార్టీల నాయకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల స్వభావం విశాఖలోని 'ప్రజావేదిక' సభా వేదికగా బట్టబయలైంది. విశాఖ స్టీల్‌కు ద్రోహం చేస్తూ.. కార్పొరేట్ మిట్టల్‌కు దాసోహం అన్న రీతిలో వారి మాటలు సాగాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటే కాని మిట్టల్ స్టీల్‌కు ఐరన్ ఓర్ గనులను పైప్‌లైన్ ద్వారా ఇవ్వాలంటూ మోడీని కోరానని, అందుకు ఆయన అంగీకరించారని చెబుతూ ప్రధానిని పొగడ్తల్లో ముంచెత్తడం గమనార్హం. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ తుంగలో తొక్కుతూ ఉక్కు కార్మికుల పోరాటానికి టిడిపి, జనసేన పార్టీలు రెండూ వెన్నుపోటు పొడిచాయనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి లేదనే చెప్పాలి. కనీసం మాట మాత్రమైనా విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ప్రస్తావన చేయకుండా మిట్టల్ గురించి చంద్రబాబు మాట్లాడుతూ ఈ ప్లాంట్ రాబోతుందని, విశాఖ ప్రజలకు ఇంతకంటే ఏం కావాలని ? అంటూ వేదికపై నుంచి ప్రశ్నించడం అందరినీ విస్మయానికి గురిచేసినట్టయింది. రాజకీయాల్లో మోడీయే తనకు స్ఫూర్తి అంటూ చంద్రబాబు పదేపదే వేదికపై చెప్పడం కనిపించింది. మోడీ వికసిత్ భారత్ సమగ్ర అభివృద్ధి విధానం అంటూ రూ.లక్షల కోట్ల మిగతా 2లో..

నిర్బంధంపై నిరసనల వెల్లువ

▶ వార్త 5లో..

సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు 10న ధర్నా

▶ వార్త 4లో..

గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా ఎపి

▶ వార్త మెయిన్‌లో..

కేంద్ర కారాగారంలో మళ్లీ సెల్‌ఫోన్ కలకలం

వార్త మెయిన్‌లో..

ప్రధాని పర్యటన వేళ..
అరెస్టుల పర్వం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదని, బల్క్‌డ్రగ్ పార్కు వద్దని ఆందోళనలు

విశాఖ, రాజయ్యపేటల్లో సిపిఎం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి, ఎంవిపి.కాలనీ విలేకరులు

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన వేళ.. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బుధవారం నిరసనలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమిస్తున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల నాయకులు ప్రధాని బహిరంగ సభ సమీప ప్రాంతమైన మద్దిలపాలెం వద్ద మెరుపు నిరసనకు దిగారు. పోలీసుల రాకతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మద్దిలపాలెం సమీపంలోని కిన్నెర, కామేశ్వరి థియేటర్ సమీప ప్రాంతం నుంచి మద్దిలపాలెం కూడలి వరకు పోలీసు వలయాన్ని ఛేదించుకుంటూ సిపిఎం, సిపిఐ నాయకులు దూసుకెళ్లారు. మోడీ గో బ్యాక్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బ్యానర్‌లు, నల్ల జెండాలు పట్టుకుని ఆందోళన కారులు తమ నిరసన తెలిపారు. పోలీసులు వారిని అరెస్టు చేసి విశాఖ మూడో పట్టణ, ఎంవిపి.కాలనీ, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు, నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, సిపిఐ నాయకులు ఎ.విమల, కె.సత్యనారాయణ సహా 120 మంది ఉన్నారు.

కాంగ్రెస్ నాయకులు దండి ప్రియాంక, మమతా నాగిరెడ్డి, లక్కరాజు రామారావు తదితరులు ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగగా వారిని అరెస్టు చేశారు.

రాజయ్యపేటలో ఉద్రిక్తత

- సిపిఎం నాయకులను తరలిస్తున్న పోలీస్ వాహనాన్ని మత్స్యకార మహిళలు అడ్డగింత

హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గం పాయకరావుపేట పరిధిలోని నక్కపల్లి మండలం రాజయ్యపేటలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ పాటిమీద, మూలపర్ర, తమ్మయ్యపేట నిర్వాసితులు నిరసన తెలిపారు. పాటిమీద నిర్వాసితులు ప్లేట్లు పట్టుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దుచేయాలని రాజయ్యపేటలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఎపి లక్ష్యాలకు అండగా ఉంటాం

కార్యాలయానికి రూ.149 కోట్లతో పునాదిరాయి వేశారు. రూ.2139 కోట్లతో కృష్ణపట్నం పారిశ్రామిక పార్క్‌కు, రూ.4593 కోట్లతో 10 ప్రాజెక్టులకు సంబంధించిన రోడ్ల కనెక్టివిటీ, విస్తరణ పనులకు, 6028 కోట్లతో 6 రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. రూ.3044 కోట్లతో నిర్మించిన 234.28 కిలోమీటర్ల రోడ్లను, 323 కిలోమీటర్ల మేర వేసిన రైల్వే లైన్లను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

ప్రధానిని చూసేందుకు ఉత్సుకత

ప్రధాని మోడీ విశాఖ పర్యటనలో భాగంగా నిర్వహించిన రోడ్‌షోకు స్పందన వచ్చింది. ఆయన్ని చూసేందుకు ప్రజలు ఉత్సుకత చూపారు. ప్రధానితోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందరేశ్వరి ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాప్ వాహనంలో సభవేదిక ఎయు ఇంజినీరింగ్ కాలేజీ మైదానం వరకు కిలోమీటరున్నర దూరం రోడ్‌షో నిర్వహించారు. దారిపొడుగునా మహిళలు, యువకులు, చిన్నారులు పూలు చల్లుతూ, కేకలు వేస్తూ స్వాగతం పలికారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీస్తూ జనం సందడి చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజానీకానికి అభివాదం చేస్తూ రోడ్డు షో సాగింది. పోలీసులు ఎక్కడికక్కడ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

ప్లకార్డులకు అనుమతించాలని వాగ్వివాదం

రోడ్‌షోలో ప్రధాని మోడీ, ఎంపీ సిఎం రమేష్ ఫొటోలతో ఉన్న ప్లాస్టిక్ ప్లకార్డులను ప్రదర్శనకు అనుమతించకపోవడంతో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కె.సురేంద్రమోహన్ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పోలీసులపై అగ్రహం వక్తం చేసారు.

ఘన స్వాగతం, వీడ్కోలు

విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని మోడీని ఐఎన్ఎస్ డేగలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆత్మీయ స్వాగతం పలికారు. వీరితోపాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, తూర్పు నావికాదళ కమాండర్ వైస్ అడ్మిరల్ పెందార్కర్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఆర్.కృష్ణయ్య, ఎంపీ సిఎం.రమేష్, ఎం.శ్రీభరత్, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ప్రభుత్వ విప్‌లు పి.గణబాబు, డాక్టర్ బెందాళం అశోక్, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు సిహెచ్ ఆదినారాయణ రెడ్డి, బండారు సత్యనారాయణ మూర్తి, అదితి గజపతిరాజు, కోండ్రు మురళీమోహన్, కొణతాల రామకృష్ణ, కామినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ఇదిలా ఉండగా విశాఖలో వివిధ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాలు ముగించుకొని తిరిగి పయనమవుతున్న మోడీకి ఐఎన్ఎస్ డేగలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి సాదర వీడ్కోలు పలికారు.

విశాఖ స్టీల్‌కు ద్రోహం.. మిట్టల్‌కు దాసోహం

ప్రాజెక్టులు విశాఖకు వస్తుంటే.. మిట్టల్ స్టీల్ వస్తుంటే ఇంకా మీకేం కావాలంటూ సభికులనుద్దేశించి చంద్రబాబు వ్యాఖ్యానాలు చేశారు.

బాబు గొంతు చించుకున్నా.. కానరాని జన స్పందన

సభా వేదికపై రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన మోడీ చేశారని చంద్రబాబు గొప్పగా చెప్పినా జనం నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. సూపర్ సిక్స్ అమలుకు కొన్ని కష్టాలు, సమస్యలు ఉన్నా ముందుకెళతామని, అన్నీ కూడా అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించినా ఒక్కరి నుంచీ కూడా చప్పట్లు వినిపించలేదు. విశాఖ వేదికగా తాము నిర్వహించిన 'రోడ్ షో' అదిరిపోయిందని, ప్రజలు తమపై నమ్మకం వుంచి ఈ సభను సక్సెస్ చేశారని చంద్రబాబు చెప్పుకోవడం కనిపించింది. మోడీ మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకుని ఉపాధి పెంచడానికి 'డబుల్ ఇంజిన్ సర్కారు' దోహదపడుతుందని చెప్పినా స్పందన కనిపించలేదు.

ప్రసంగాలు నడుస్తుండగా లేచి వెళ్లిన ప్రజలు

టిడిపి, జనసేన పార్టీ నాయకులు మూడు జిల్లాల నుంచీ అత్యధికమంది జనాన్ని తరలించడానికి పెద్ద ఎత్తున రూ.లక్షలు వెచ్చించాయి. తీసుకొచ్చిన ప్రతి మనిషికీ రూ.500 చొప్పున ఇచ్చినట్లు స్వయంగా సభకు హాజరైన జనమే వెల్లడించారు. ఈ నేపథ్యంలో సభ జరుగుతుండగానే వందల సంఖ్యలో జనం బయటకు వెళ్లిపోవడం కనిపించింది. చంద్రబాబు ప్రసంగం మధ్యలోనే పలువురు లేచిపోగా మోడీ ప్రసంగాన్ని ప్రారంభిస్తున్న సమయంలోనే మహిళలు పలువురు సభా ప్రాంగణం నుంచి బయటకు వెళ్లిపోవడం కనిపించింది.

అరెస్టుల పర్వం

రాజయ్యపేటలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మత్స్యకారులు

(మొదటి పేజీ తరువాయి..)
మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. ప్రధాని మోడీ బల్క్ డ్రగ్ పార్క్‌కు విశాఖపట్నం నుంచి వర్చువల్‌లో శంకుస్థాపన చేయడంపై మత్స్యకారులు రాజయ్యపేటలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. రాజయ్యపేటలో మత్స్యకారులతో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, నక్కపల్లి మండల కార్యదర్శి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణను పోలీసులు వాహనం ఎక్కించి నిరసనకారులను చెదరగొట్టడానికి చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించారు. మహిళలను మగ పోలీసులు పట్టుకొని పక్కకు తోశారు. నాయకులను వాహనంలోకి ఎక్కించడాన్ని మహిళలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, మత్స్యకార మహిళలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉద్రిక్తత పరిస్థితి కాసేపు ఏర్పడింది. బలవంతంగా నాయకులను ఎక్కించిన వాహనానికి అడ్డంగా కూర్చున్నారు. నాయకులను విడిచిపెట్టాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో కోటేశ్వరరావు, శంకరరావు, రాజేష్, సత్యనారాయణలను పోలీసులు ద్విచక్రవాహనంపై నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఎస్.రాయవరం స్టేషన్‌కు రాజేష్, సత్యనారాయణను, కోటేశ్వరరావు, శంకరరావును అనకాపల్లికి తరలించారు.

పోలీసు చర్యను నిరసిస్తూ మత్స్యకారులు ఆందోళన చేశారు. సిపిఎం నాయకుడు మహేష్‌ను పోలీసులు పట్టుకొని తీసుకెళ్లాలని చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. మహిళలు వలయంలా ఏర్పడి మహేష్‌ను చుట్టుముట్టి పోలీసులు తీసుకెళ్లకుండా ప్రతిఘటించారు. గృహ నిర్బంధంలో ఉన్న జాన్, బైరాగి రాజు బయటకు వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి గృహ నిర్బంధంలో ఉన్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు సహా మహేష్, మైలపల్లి జాన్, బైరాగి రాజును మోడీ సభ అయ్యే వరకు విడిచిపెట్టలేదు. రాజయ్యపేట వద్ద ఏర్పాటుచేసిన వర్చువల్ సభలో నిరసనలు తెలపకుండా నాలుగు వైపులా పోలీసులు నిఘాపెట్టి లోపలకు పంపించారు.

జెడ్‌పిటిసి కాసులమ్మ గృహ నిర్బంధం

నక్కపల్లి జెడ్‌పిటిసి గోసల కాసులమ్మను రాజయ్యపేటలో తన స్వగృహంలో పోలీసులు బుధవారం గహ నిర్బంధం చేశారు. వైసిపి సీనియర్ నాయకుడు వీసం రామకృష్ణ, చందనాడ ఎంపిటిసి గంటా తిరుపతిరావు, వైసిపి నాయకులు తళ్ల భార్గవ్, సూరకాసుల గోవింద్‌లను నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తరువాత అక్కడ నుంచి పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

సొంత గనుల హామీని మోడీ నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇస్తానన్న హామీని ప్రధాని నరేంద్ర మోడీ నిలబెట్టుకోవాలని పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ ఎస్ జ్యోతీశ్వరరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి దీక్షల్లో బుధవారం 1381వ రోజున సిఐటియు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికులపై కక్షగట్టినట్లు ప్రభుత్వం, యాజమాన్యం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు నిలుపుదల, ఇంటి అద్దెకోత, విద్యుత్ బిల్లుల పెంపు, ఎల్‌టిసి, ఎల్ఎల్‌టిసి ఎర్నడ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నిలుపుదల చేశారన్నారు. ఇంత జరుగుతున్నా సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చోద్యం చూడడం దుర్మార్గమన్నారు. విశాఖ బహిరంగసభలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటనతోపాటు సెయిల్‌లో విలీనం, సొంతగనుల కేటాయింపు, ఐదు వేల ఉద్యోగాల భర్తీ, పూర్తిసామర్థ్యం, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగింపు తదితర అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు వై.రాజు, ప్రకాశరావు, లక్ష్మీపతి, లక్ష్మణమూర్తి, సూరప్పడు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్న సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్ష పార్టీలు, విశాఖ ప్రజలను అక్రమ అరెస్టులు చేయించడం అమానుషమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు సంయుక్త ప్రకటనలో ఖండించారు. మోడీ విశాఖ పర్యటనకు ముందే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపు, ప్రభుత్వ రంగంలోనే విశాఖ ఉక్కు కొనసాగించాలని, ఉద్యోగులను వేధింపులకు గురిచేయకుండా జీతాలు చెల్లింపు వంటి సమస్యలపై ప్రధాని ప్రకటన చేయాలని నెలరోజులుగా విశాఖ ప్రజలు, వామపక్ష పార్టీలు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేస్తున్నాయని, అయితే దీనిపై ప్రధాని మోడీ నుంచి ఎటువంటి ప్రకటన రాకపోవడం వల్లే ఆందోళనకు గురై నిరసన తెలియజేశామన్నారు.

మహారాజశ్రీ 4వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.C. No. 4/2024

Between:
Beeraka Nandeswaramma, W/o. Beeraka Subrahmanyam, age 63 years, R/o. D.No. 116-3-23, Bommana Rajkumar Colony, Bommana Rajkumar Street, Korukonda Mandalam, E.G.District.
...Petitioner
AND
Beeraka Subrahmanyam, S/o. Beeraka Appa Rao, age 78 years, D.No. 10-169/1/3, Beside Happy Oye Restaurant, Near Dayala Nagar Gate, Visalakshmi Nagar, Visakhapatnam District. ***...Respondent***

పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 17-1-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
S.FATHIMA BATLU
రాజమండ్రి Advocate
08-1-2025 Rajahmundry

థీమాటిక్ ఎగ్జిబిషన్
లేపాక్షి హస్తకళలు, జగదాంబ జంక్షన్, విశాఖపట్నం.

శ్రీ విశ్వ ఎం, **VC & MD, APHDCL**, విజయవాడ, వారి సూచనల మేరకు, **లేపాక్షి హస్తకళలు, జగదాంబ జంక్షన్, విశాఖపట్నంలో *థీమాటిక్ ఎగ్జిబిషన్*ను నిర్వహించడం పట్ల సంతోషిస్తున్నాము, దీనిని 07-01-2025 నుండి 11-05-2025 వరకు (5 రోజులు) షెడ్యూల్ చేయబడింది.**

ఈ ఎగ్జిబిషన్ ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు విభిన్న హస్తకళలకు సంబంధించిన ప్రదర్శన నిర్వహించబడును, పండుగ సీజన్‌లో స్థానిక హస్తకళలను ప్రోత్సహించడం మరియు కళాకారులకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది.

కళాకారులు తమ చేతితో తయారుచేసిన వివిధ రకాల కళాఖండాలను నేరుగా ప్రదర్శిస్తారు మరియు విక్రయిస్తారు. ఇందులో పాల్గొనే హస్తకళలు ఇలా ఉన్నాయి :

- పెన్ కలంకారి పెయింటింగ్స్ (శ్రీ కాళహస్తి)
- అరటి ఫైబర్ ఉత్పత్తులు (కడప)
- ఏటికొప్పాక బొమ్మలు (అనకాపల్లి జిల్లా)
- సవర ఆదివాసీ పెయింటింగ్స్ (సీతంపేట)
- వైట్ వుడ్ బర్డ్స్ (రాజమండ్రి)

ఆంధ్రప్రదేశ్ యొక్క గొప్ప హస్తకళా సంప్రదాయాలను ప్రోత్సహించడంతో పాటుగా కళాకారులకు వేదికను అందించడం ఈ ప్రదర్శన యొక్క ప్రధాన లక్ష్యం. స్థానిక నివాసితులందరూ ఈ ప్రదర్శనను సందర్శించి, మా స్థానిక హస్తకళలు, కళాకారులకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాను.

మరియు

ఎంచుకున్న హస్తకళలు, హ్యాండ్లూమ్స్‌పై 20% వరకు తగ్గింపు, ఈ ఆఫర్ 13-01- 2025 తో ముగుస్తుంది.

ధన్యవాదాలతో

మీ విశ్వాసపాత్రులు
మేనేజర్

IN THE HON'BLE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.330/2023

Between:
CANARA BANK,
Adarshnagar Branch,
Visakhapatnam
Rep. by its Branch Manager ...Plaintiff
And:
M/s. Affair Exclusive Male Store & 2 others ...Defendants

SUMMONS

To,
Defendant No.2:
Mohammad Zakriya,
S/o. Nagoor Meera, Muslim,
aged about 34 years,
R/at D.No.38-30-265/2,
Hussain Nagar, Marripalem,
Visakhapatnam-530018.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **23-01-2025** for your appearance on that day **10:30 A.M**. you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
P. NAGINI
Advocate, Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE AT GAJUWAKA
O.S. 24/2023

Between:
Indukuri Srinivasa Raju,
rep. by his agent and attorney
Indukuri Appalaraju ...Plaintiff
And:
Doddhala Ramesh Babu & others ...Defendants

SUMMONS

To
D-4: Sri T. Jagannadham,
S/o. Paul, R/at D.No. 4-45,
Natayyapalem, BHPV (Post),
Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you as defendant No.4 and in the above suit summons have not been served on you in ordinary way and that the Hon'ble Court was pleased to order notice to you by substituted service by way of paper publication. The said suit stands posted to **24-01-2025** for your appearance on that day **10:30 A.M**. you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
V.V. RAVI PRASAD,
J.V. RAMA KRISHNA,
Advocates,Visakhapatnam.
Cell: 98485 69707.

IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE AT GAJUWAKA
O.S. 23/2023

Between:
Chanda Sreenivasulu ...Plaintiff
And:
Doddhala Ramesh Babu & others ...Defendants

SUMMONS

To
D-4: Sri T. Jagannadham,
S/o. Paul, R/at D.No. 4-45,
Natayyapalem, BHPV (Post),
Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you as defendant No.4 and in the above suit summons have not been served on you in ordinary way and that the Hon'ble Court was pleased to order notice to you by substituted service by way of paper publication. The said suit stands posted to **24-01-2025** for your appearance on that day **10:30 A.M**. you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
V.V. RAVI PRASAD,
J.V. RAMA KRISHNA,
Advocates, Visakhapatnam.
Cell: 98485 69707.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

బస్సుల కోసం తగరపువలస జంక్షన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభ నేపథ్యంలో ఆర్‌టిసి బస్సులు లేక ప్రయాణికులు నానా తిప్పలు పడ్డారు. స్థానికంగా ఇక్కడ నుంచి రోజూ వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకునేందుకు కార్మికులు, ఉద్యోగులు వందల సంఖ్యలో విశాఖ నగరానికి వెళ్తూ వస్తుంటారు. విద్యార్థులు కూడా వెళ్లి వస్తుంటారు. విశాఖ నుంచి ఇక్కడకు విద్యార్థులు వస్తుంటారు. బస్సు పాస్‌లుండి కూడా ఆటోల్లో వెళ్లాల్సి వచ్చిందని కొందరు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ప్రజాశక్తి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

తుని వెళ్లేందుకు చంటి బిడ్డతో తగరపువలస జంక్షన్‌లో తల్లి, కుటుంబ సభ్యులు ఆర్‌టిసి బస్సు కోసం ఉదయం 8 గంటల నుంచి సుమారు 3 గంటల పైబడి నిల్చుని నిరీక్షించారు. కూర్చునేందుకు సౌకర్యం లేదు. ఎప్పటికీ బస్సు రాకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ఆటోపై వెళ్లారు.

చాలా ఇబ్బందిగా ఉంది

వైజాగ్ వెళ్లేందుకు ఉదయాన్నే వచ్చాను. బస్సులు లేవు. పెద్దోళ్ల మీటింగులకు పేదోళ్లను ఇలా ఇబ్బందులు పెట్టడం సభవా?

అప్పయ్యమ్మ
చిన నాగమయ్యపాలెం
భీమిలి మండలం

మా బాధలు పట్టవు

మీటింగులకు ఆర్‌టిసి బస్సులు వెయ్యడం ఏం బాగుంది. మొత్తంగా బస్సులు వెయ్యడం వల్ల ఆటోలకు వెళ్ళ వలసి వచ్చింది.

సరస్వతి
భీమిలి

బస్సులకు స్పందన నామ మాత్రం...

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు రాష్ట్ర ప్రభుత్వం జన సమీకరణపై పెద్ద ఎత్తున దృష్టి సారించింది. ఇందుకు కూటమి శ్రేణులను, అన్ని స్థాయిల్లో అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసింది. ఇందులో భాగంగా బుధవారం చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్ నుంచి (1, 2 వార్డులు) 53 ఆర్‌టిసి బస్సులు, బ్యాంక్ కాలనీ నుంచి 4, పోలీస్ స్టేషన్ నుంచి 5, ఎగువ పేట వేదిక నుంచి 13, యోగా కేంద్రం నుంచి 7, జివిఎంసి 4వ వార్డు పరిధి చేపలుప్పాడ తుపాను రక్షిత భవనం నుంచి 28 ఆర్‌టిసి బస్సులను వేశారు. కానీ అనుకున్న స్థాయిలో జనం వెళ్లకపోవడం కనిపించింది.

చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ మైదానంలో ఉంచిన బస్సులు

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌తో పట్టుబడ్డ గంజాయి

200 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చోడవరం : ట్రాక్టర్ తొట్టి కింద అరలో అమర్చి తరలిస్తున్న 200 కేజీల గంజాయిని చోడవరం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలం నుండి ట్రాక్టర్ వస్తున్నట్లు గమనించిన పోలీసులు చోడవరం కొత్తూరు జంక్షన్‌లో తనిఖీ చేశారు. ఆ ట్రాక్టర్ తొట్టి కింద అరలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అందులో ఉన్న 200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలు పోలీసులు వెల్లడించవలసి ఉంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామపంచాయతీలో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్లుకు బుధవారం సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ అభివృద్ధికి గ్రామ ప్రజలందరూ పార్టీలకతీతంగా కట్టుబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు, తాత్రాజు అప్పారావు, బంకు రాజు, రమేష్‌నాయుడు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెంలో దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్

ప్రజాశక్తి -ఉక్కునగరం : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధర్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చిత్ర దర్శకులు ఎం.సేనాపతి మాట్లాడుతూ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, భూస్వాముల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడి అమరుడైన దొడ్డి కొమరయ్య చిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ సభ్యులు ఎస్‌కె.అబ్దుల్‌రెహమాన్, తక్కళ్లపల్లి విజయకుమార్, రావుల శ్రీనివాస్, నాగరాజు, మద్ది అప్పలరెడ్డి, ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.బలరాం, వి.సహదేవ్ పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఫణికుమార్

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్ గురువారం ప్రజాశక్తి దినపత్రిక కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి మధురవాడ డివిజన్ ఆర్గనైజర్ ఆర్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శేరిఖాండంలో తాగునీటి సమస్య

పద్మనాభం మండల సమావేశంలో సర్పంచ్ చిన్నారావు ఆవేదన

ప్రజాశక్తి- పద్మనాభం : రెండేళ్లుగా శేరికాండం గ్రామానికి తాగునీరు కరువైందని పంచాయతీ సర్పంచ్ పి.చిన్నారావు మండల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి కె.రాంబాబు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఎంపిపి రాంబాబు పలు శాఖల అధికారులతో శాఖల వారీగా సమీక్ష చేశారు. ముందుగా రోడ్లు భవనాల శాఖ సమీక్షలో ఎఇ మాట్లాడుతూ, చిన్నాపురం నుంచి నీలకుండీల వరకు రోడ్డు మరమత్తులు చేసినట్లు తెలిపారు. పద్మనాభం నుంచి రెడ్డిపల్లి వెళ్లే రోడ్డు మార్గం శిథిలమైందని, పదేళ్లుగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని శేరికాండం సర్పంచ్ చిన్నారావు, బి.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఎఇ స్పందిస్తూ సంక్రాంతి తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామ స్థాయిలో ఎటువంటి సమస్యలూ లేకుండా పనులు చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను ఎంపిపి కోరారు. ఆరోగ్య శాఖపై సమీక్షలో రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి మాట్లాడుతూ, కొత్తగా వచ్చిన వైరస్ వల్ల ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, జలుబు, దగ్గు తదితర లక్షణాలుంటే మాస్కో ధరించుకుంటే సరిపోతుందని తెలిపారు. రేవిడి పిహెచ్‌సి ప్రాంగణంలో కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని తొలగించాలని రేవిడి ఎంపిటిసి సభ్యుడు ఎస్.సూరప్పుడు కోరారు. కొత్తగా మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. గ్రామస్థాయిలో ఉన్న విలేజ్ క్లినిక్‌ల్లో ఎవరూ ఉండటం లేదని కొంతమంది సర్పంచులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఎంపిపి స్పందిస్తూ వైద్యాధికారుల్లో ఎవరో ఒకరిని తప్పనిసరిగా ఉంచాలని ఆదేశించారు. రబీ సీజన్‌కు సంబంధించి మినుములు, పెసలు, వేరుశనగ, చోడి విత్తనాలను రైతులకు పంపిణీచేశామని వ్యవసాయ శాఖ సమీక్షలో మండల వ్యవసాయాధికారి వివరించారు. 50 శాతం రాయితీపై తార్పాలిన్లు త్వరలోనే వస్తాయన్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మండలంలోని అన్ని పంచాయతీల్లో సిసి రోడ్ల ప్రారంభమయ్యాయని, ఒక మద్ది గ్రామంలో చేపట్టలేదని తెలిపారు. అనంతవరం నుంచి గన్నవరం రహదారిలో వంతెన నిర్మాణానికి పనులు జరుగుతాయన్నారు. విద్యాశాఖపై సమీక్షలో ఎంఇఒ పి.రమణ మాట్లాడుతూ, మండల స్థాయిలో అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి సైన్స్ ఫెయిర్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. 11 పాఠశాల విద్యార్థులు 220 నమూనాలు తయారుచేశారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 18 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాడు- నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని కొనసాగించాలని కొంతమంది ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు కోరారు. మండల పశు వైద్యాధికారి మహేష్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి ఎకరా భూమిలో పశువులకు పచ్చగడ్డి పెంచితే రూ.62 వేలు మంజూరు అవుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాడిపశువుల కోసం అన్ని బ్యాంకులు ఆవుకు రూ.20 వేలు చొప్పున రుణాలు ఇస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ ఎఇ నళిని మాట్లాడుతూ, మండలంలో ఉన్న చెరువుల్లో నీటి సంఘాలు ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఈ సమీక్షలో పొట్నూరు ఎంపిటిసి సభ్యులు టి.దివ్య మాట్లాడుతూ, అన్ని చెరువుల్లోనూ మదుములు పూర్తిగా శిథిలమైపోయాయని, నూతనంగా నిర్మించాలని కోరారు. గంజాయి, నాటుసారా గ్రామస్థాయిలో ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని భీమిలి ఎక్సైజ్ శాఖ పిసి శ్రీనివాసరావు కోరారు. బెల్టు షాపులను అరికట్టాలని ఎంపిటిసి దివ్య కోరారు. పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి మాట్లాడుతూ, పంచాయతీల్లో నిధులు సమకూర్చుకోవడానికి చెరువుగట్టుపై ఖాళీగా ఉన్న స్థలాల్లో కొబ్బరి మొక్కలు నాటుకుంటే ఆదాయం పొందవచ్చన్నారు. ఉద్యానవన శాఖ అధికారి మాట్లాడుతూ, మామిడి, జీడి, కూరగాయ పంటలకు పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జయ ఉమ, వైస్ ఎంపిపి రాజేశ్వరి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పద్మనాభం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

బ్యాడ్జీలు, పంపిణీ చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి మద్దతుగా..

భెల్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నిరసన

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా భెల్‌లోని పొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యాన భెల్ మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన తెలిపారు. ప్రధాని విశాఖ వచ్చిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని చెప్పాలని డిమాండ్ బ్యాడ్జీలను ఉద్యోగులకు పంపిణీ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్ మాట్లాడుతూ, గతంలో బిహెచ్‌పివి ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు జరిగిన పోరాటాల్లో స్టీల్ కార్మికులు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. బిహెచ్‌పివిని భెల్‌లో విలీనం కోసం చేసే ప్రతి పోరాటంలో స్టీల్ కార్మికులు పాల్గొని సంఘీభావం తెలియజేశారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి భెల్ కార్మికులు మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.బాబూరావు, ఎస్.జగన్నాధరావు, వి.ఆనందరావు, పి.కనకారావు, సీతనాయుడు, కె.కేశ్య, ఎన్.వెంకట్రావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'యంగ్ ఇండియాలో భాగస్వాములు కావాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 'యంగ్ ఇండియా కే బోల్' సీజన్5 కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. దేశ యువత కోసం సత్యం, న్యాయం, సమానత్వం కోసం పోరాడుతున్నామన్నారు కోరారు. ఆంధ్రాలోని యువత ఈ వెబ్‌సైట్‌కు వీడియోలు పంపాలని, విజేతలకు బహుమతులు అందజేస్తా మన్నారు. డిసిసి అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మరాజు మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా, వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం యంగ్ ఇండియా సీజన్ 5 లక్ష్యమన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్కరాజు రామారావు, శివకుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయితీ బిజ్జగూడ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. బిజ్జగూడ గ్రామంలో నివాస ముంటున్న పీవిటిజి కుటుంబానికి చెందిన కిల్లో పొల్లు కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది.బుధవారం ఉదయం 9 గంటల సమయంలో విద్యుత్ మీటర్ నుంచి మంటలు చెలరేగి ఇంటిలో సామాగ్రిలు, మంచం ఖాళీ బూడిదయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పి వేశారు.ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికీ ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సమర్డి బాబూరావు, సోడేపల్లి, ఆనందరావు, రామచందర్, భాస్కరరావు, గురుమూర్తి డిమాండ్ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయితీ కిముడుపల్లి గ్రామంలో బుధవారం క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడ వెంకట సురేష్ కుమార్, సోమల చిట్టిబాబు, శోభ శ్రీనివాస్, ఖాన్, కె ప్రకాశరావు, కృష్ణ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు ద్రోహం దారుణం

- మరోసారి మొండిచేయి చూపిన ప్రధాని మోడీ
- సమస్యల ప్రస్తావనలో చంద్రబాబు, పవన్ విఫలం
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా ప్రధాని మోడీ మరోసారి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు, ఉత్తరాంధ్రకు ద్రోహం చేశారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ధ్వజమెత్తారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరణ, సొంత గనులు కేటాయింపు, కాపిటల్ రీ స్ట్రక్చరింగ్ కింద రూ.18 వేల కోట్లు కేటాయింపుపై ప్రధాని ప్రకటన చేయకపోవడం ద్రోహమేనన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మిట్టల్‌కు బలిచ్చేలా కేంద్ర బిజెపి, రాష్ట్రంలోని టిడిపి, జనసేన కూటమి కుట్ర పన్నినట్టు మోడీ బహిరంగ సభతో తేలిపోయిందన్నారు. దీనికి టిడిపి,జనసేన కూటమి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఒక్క మాటయినా మాట్లాడకుండా, ఆర్సిలార్ మిట్టల్ స్టీల్‌కు ముడి ఖనిజం సరఫరా, ఇతర అనుమతుల గురించి మాట్లాడటం విశాఖ స్టీల్ ప్లాంట్ కి ద్రోహం చేయడమేనన్నారు ప్రధాని మోడి ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యలను ప్రస్తావించకపోవడం దుర్మార్గమని, సభకు, రోడ్‌షోకు భారీగా వచ్చిన ప్రజలకు నిరాశకు గురిచేసినట్టేనన్నారు.

విభజన చట్టంలోని విశాఖ మెట్రో రైల్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడ్డ ప్రాంతాలకు అభివృద్ధి ప్యాకేజీని పూర్తిగా మరిచారన్నారు. మోడీని ప్రసన్నం చేసుకోవడానికి పోటీపడ్డ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఈ విషయాలను మోడీ దృష్టికి తేలేదన్నారు. పరస్పర పొగడ్తలతో ముగ్గురూ రాష్ట్రాన్ని మోసగించారన్నారు. ప్రజలు వద్దు మొర్రో అంటున్న నక్కపల్లి బల్క్ డ్రగ్స్ ప్లాంటుకు శంకుస్థాపన చేసి గొప్పలకు పోయారన్నారు. గ్రీన్ ఎనర్జీ నిర్వాసితులు, వాల్తేరు రైల్వేడివిజన్ విషయాలను పక్కన పెట్టేశారన్నారు. పదేళ్ల క్రితం జరగాల్సిన రైల్వేజోన్ ఏర్పాటుకు శంకుస్థాపన ఎట్టకేలకు చేయడంలో గర్వపడేదేముందన్నారు. స్టీల్‌ప్లాంటుపై ప్రధాని మోడీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్న వామపక్ష నేతలను ఒకరోజు ముందే గృహనిర్బంధం చేయడాన్ని జగ్గు నాయుడు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని, సెయిల్‌లో విలీనం, సొంతగనుల కేటాయింపుతో బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు 10న ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన గాంధీ పార్కు వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గాజువాక సిఐటియు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది మున్సిపల్ కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన ఒప్పందాలను కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. గొలగాని అప్పారావు మాట్లాడుతూ, సమ్మె కాలపు ఒప్పందాల జిఓలు జారీచెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబును, మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణను, ఉన్నతాధికారులను యూనియన్ నాయకులు పలుమార్లు కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ సమావేశంలో గొల్ల రాము, నక్క నాగరాజు, వై.చిన్నారావు, ఎస్.గణేష్, మీనాక్షి, వరలక్ష్మి, సత్యవతి, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాంబాబు

'నాల్కో పోర్ట్' వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విశాఖపట్నంలోని నాల్కో పోర్ట్ ఫెసిలిటీస్ 45వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలోని ప్రయివేటు హోటల్‌లో నిర్వహించారు. విశాఖ పోర్టు అథారిటీ వైస్ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే పాల్గొన్నారు. పిఎఫ్ గ్రూప్ జనరల్ మేనేజర్ ఎవి.సుబ్బారావు మాట్లాడారు. పెద్దసంఖ్యలో నాల్కో, విశాఖ పోర్టు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, 5వ స్ట్రీమ్ ప్రాజెక్టు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యఅతిథికి జ్ఞాపికను బహూకరణ

తోటి వారికి సాయంలో ఆనందం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

ఇతరులకు సాయం చేయడంలో ఎంతో ఆనందముంటుందని బాల వికాస ఫౌండేషన్ సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. బుధవారం బీచ్ రోడ్డు బుక్కా వీధి బాల వికాస ఫౌండేషన్ బ్రిడ్జి స్కూలు ఆవరణలో సంఘ సేవకురాలు అన్నమ్మ ఆర్థిక సాయంతో 45 మంది మహిళలకు సంక్రాంతి కానుకగా చీరలు పంపిణీ చేశారు. దాత అన్నమ్మకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి,నందిని, డాక్టర్ బాబ్జి, సునంద, కుమారి పాల్గొన్నారు

పోర్టు హాస్పిటల్ టెండర్‌కొస్తే అడ్డుకుంటాం

100వ రోజు దీక్షలో పద్మనాభరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ టెండర్ పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుంటామని విశాఖ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు హెచ్చరించారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 100వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పద్మనాభరాజు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రయివేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని గుర్తుచేశారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం అనర్థమని తెలిపారు. విశాఖ అభివృద్ధికి వైజాగ్ పోర్టు కీలకమని, ఏటా మున్సిపాలిటీకి సగటున రూ.65 కోట్లు పన్నులు కడుతున్న పోర్టును ప్రయివేటుకు ధారాదత్తం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందని చెప్పారు. ఆసుపత్రి ప్రయివేటీకరణకు టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్మిక వర్గ పోరాట ఫలితంగానే వాయిదా వేశారని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయం అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, కెఎస్.కుమార్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

100వ రోజు దీక్షలో కూర్చున్న విఎస్.పద్మనాభరాజు తదితరులు

నిర్బంధంపై నిరసనల వెల్లువ

అనకాపల్లిలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టులు, గహ నిర్బంధం చేయడంపై నిరసనలు వెల్లువెత్తాయి.

దేవరాపల్లి : సిపిఎం నేతలపై నిర్బంధాన్ని నిరసిస్తూ దేవరాపల్లి మండలంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడుతూ సిపిఎం నేతల నిర్బంధం టిడిపి కూటమి ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సిపిఎం నేతలను గృహ నిర్బంధం చేయడం ద్వారా ప్రజా ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

అనకాపల్లి : సిపిఎం నేతల అరెస్టులు, గృహ నిర్బంధంపై సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బాటా సెంటర్ వద్ద రాస్తారోకో చేశారు. దీంతో భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ విదేశాల్లో నిషేధించిన, కాకినాడ ప్రజలు వ్యతిరేకించిన కాలుష్య కారక బల్క్ డ్రగ్ పార్కును అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కాళ్ళ తేలయ్యబాబు, పి.చలపతి, బీశెట్టి అప్పారావు, తిర్రే సురేష్, కాపుశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

రాంబిల్లి : సిపిఎం నాయకుల గృహ నిర్బంధంపై రాంబిల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ పూడిమడక ఎన్టిపిసి గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌లో స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడ : నాయకులు గృహ నిర్బంధం, అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలో ఫార్మసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె పోతినాయుడు, పి.చిన్నారావు, సత్తిబాబు, వై అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన ఆపాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కర్రి అప్పారావు మాట్లాడుతూ ప్రధాని పర్యటన సందర్భంగా సిపిఎం నాయకులను కార్యకర్తలను హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పూడిమడకల గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణంలో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సరగడం రామనాయుడు, అగ్రహారపు రాము, నడిపూరు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ హౌస్ అరెస్టులు

మునగపాకలో నిర్బంధంలో ఉన్న సిపిఎం నేత బ్రహ్మాజీ

తన ఇంటి వద్దే నిరసన తెలుపుతున్న అప్పలరాజు తదితరులు

ప్రజాశక్తి- మునగపాక

ప్రధాన మంత్రి మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా సిపిఎం మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీని పోలీసులు నిర్బంధించారు. బుధవారం ఉదయం ఆయన చెరకు క్రషర్ రిపేర్ నిమిత్తం ఇంటి నుండి వెళ్తుండగా, పోలీసు కానిస్టేబుల్ ఇంటి వద్ద నుండి బ్రహ్మాజీని వెంబడించారు. వర్క్ ముగిసే వరకు అతనితోనే ఉండి తిరిగి తిమ్మరాజుపేటలో గల తన వర్క్‌షాప్ వచ్చే వరకు వెన్నంటి ఉండి, షెడ్డు వద్దనే బ్రహ్మాజీని పూర్తిగా నిర్బంధించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణను మండలంలోని వెంకటాపురం గ్రామంలో అతని స్వగృహంలో మంగళవారం రాత్రి పోలీసులు నిర్బంధించారు.

రాంబిల్లి : ప్రధాని పర్యటన నేపథ్యంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడును తన గృహంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

అచ్యుతాపురం : గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కె.సోమునాయుడు, ఆర్.లక్ష్మిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీంతో వారు ఇంటి దగ్గర ప్లకార్డులతో నిరసన తెలిపారు. నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న కాలుష్య కారకమైన బల్క్ డ్రగ్ పార్క్ విరమించుకోవాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు.

ఎస్.రాయవరం : విశాఖలో ప్రధాని మోడి పర్యటన సంధర్భంగా మండలంలోని ధర్మవరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజును నక్కపల్లి, ఎస్.రాయవరం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. తన ఇంటి వద్ద స్థానిక యువతతో కలసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలు హరించే బల్క్ డ్రగ్ పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంత వాతావరణం కాలుష్య పూరితమవుతుందన్నారు. ఈ ప్రాంతంలో సమస్యలు పరిష్కారం చూపకుండా ఎలా పనులు చేపడతారని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఈ విధంగా గృహ నిర్బంధాల ద్వారా పోలీసులను మోహరించి రైతులను అడ్డుకుని ఎంత కాలం పనులు చేపడతారన్నారు.

ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌లో సిపిఎం నేతలు

ప్రాణాలకు నష్టం కలిగించే బల్క్ డ్రగ్స్ కంపెనీలు ఏర్పాటు చేయవద్దని సూచించారు.

అలాగే సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, ఎం రాజేష్ లను పోలీసులు అరెస్ట్ చేసి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

గొలుగొండ : భారత ప్రధాని విశాఖ నగరానికి పర్యటనలో భాగంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణను బుధవారం గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామంలో హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపి నిధులు ఆదుకోవాలన్నారు., విభజన హామీలను నెరవేర్చాలన్నారు.

భీమునిపట్నం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తిని స్థానిక పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

సీతమ్మధార : రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి ద్వారక పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు.

ఇంటి వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

సిపిఎం భీమిలి కార్యదర్శి మూర్తిని గృహ నిర్బంధం చేసిన దృశ్యం

సిపిఎం నేతలను నిర్బంధించడం అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా సిపిఎం నాయకులను నిర్బంధించడాన్ని ఆ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక దొడ్డి రామనాయుడు భవనంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో సిపిఎం నాయకుల్ని, కార్యకర్తలను ఏడో తేదీ నుంచి గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్ట్‌లు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ చర్యలు ఇలాగే ఉంటే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, ఎ.రాజు, నాయకులు జి నాయనబాబు, కె ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా ప్రతిఘటన తప్పదు : డివైఎఫ్ఐ

యలమంచిలి : ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే వారిని ప్రధాని పర్యటన నేపథ్యంలో నిర్బంధం సరికాదని, ఇలాగే వ్యవహరిస్తే ప్రజాప్రతిఘటన తప్పదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రశ్నించే గొంతల్ని గొంతుల్ని ఎలుగెత్తనీయక పోవడం నియంత చర్యలుగా ఆయన అభివర్ణించారు. మత్స్యకారులకు నష్టం కలిగించేలా సముద్రపుటంచున కాలుష్య కారక కంపెనీలు తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

థాంగ్ టా ఛాంపియన్ షిప్‌లో పతకాలు

ప్రజాశక్తి-పరవాడ : ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లో జరిగిన 30వ జాతీయస్థాయి థాంగ్ టా సబ్ జూనియర్, సీనియర్ ఛాంపియన్ షిప్-2024 పోటీల్లో జిల్లా చెందిన వారు పలు పతకాలు సాధించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్టిపిసికి చెందిన సమీక్షా సాహు 49 కేజీల సబ్-జూనియర్ (జి) కాంస్య పతకం, కేకేఎస్ సాత్విక్ 37 కేజీల సబ్-జూనియర్(బి) కాంస్య పతకం, డి ధనహర్షిణి 53 కేజీల సబ్-జూనియర్ (జి) కాంస్య పతకం, ఐ.చేతన్ సాయి 53 కేజీల సబ్-జూనియర్(బి) కాంస్య పతకం, రేఖవనిపాలెం నుంచి మొల్లి తులసీరావు 58 కేజీలు సీనియర్స్ (ఎం) కాంస్య పతకం, అచ్చుతాపురం నుంచి కలిదిండి అక్షిత్ వర్మ 33 కేజీలు సబ్-జూనియర్ (బి) కాంస్య పతకం, ఎమ్ పవన్ కుమార్ సింగ్ 45 కేజీలు సీనియర్స్ (ఎమ్) కాంస్య పతకం, స్రవంతి 80 కేజీలు సీనియర్స్ (డబ్ల్యూ) కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో ఎపి థంగ్ టా మార్షల్ ఆర్ట్స్ కార్యదర్శి మొల్లి తులసీరావు, టెక్నికల్ డైరెక్టర్ గొర్లి పుష్పారావు షెల్టన్ జెన్సులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను సందర్శించిన డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి అన్న క్యాంటిన్‌ను డివిజనల్ డెవలెప్‌మెంట్ అధికారి నాగలక్ష్మి బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుతో కలిసి సందర్శించారు. అక్కడే అల్పాహారం తీసుకున్నారు. చాలా రుచిగా ఉందని నిర్వహకుల్ని ప్రశంసించారు. రోజూ ఉదయం అల్పాహారం 300 మంది, మధ్యాహ్న భోజనం 300 మంది తీసుకుంటారని, అయితే సాయంత్రం మాత్రం 150 - 160 మందికి మించరని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఇ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి

ప్రజాశక్తి - యలమంచిలి : రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మంచి రేటు పొందాలని వ్యవసాయశాఖ ఏఈఓ దేముడు అన్నారు. యలమంచిలిలో బుధవారం జరిగిన పోలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యానికి 24 గంటల్లో రైతు ఖాతాకు డబ్బులు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. రబీలో మినుము, పెసర వంటి పంటలకు ప్రతి రైతూ 'ఈ పంట'ను స్థానిక విఎఎ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా రైతు మళ్ల చంద్రమ్మ, విఎఎలు బేస్లీ, దివ్యప్రసన్న పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

రాంబిల్లిలో..

దేవరాపల్లిలో...

తిమ్మరాజుపేటలో...

పరవాడలో...

ఆర్థిక సాయం అందిస్తున్న పివిఆర్ యువసేన ప్రతినిధులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి

అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఉదార స్వభావం చాటుకున్నారు మిత్రులు. మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన ముత్తిశెట్టి సన్యాసిరావు ఇటీవల మృతి చెందారు. కుటుంబ యజమాని చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఆయన మిత్రులు, పివిఆర్ యువసేన సభ్యులు ఆసరాగా నిలిచారు. లక్ష 50 వేల రూపాయలు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు చేతులు మీదుగా మృతుని భార్య ఉమామహేశ్వరికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పివిఆర్ యువసేన అధ్యక్షులు, గ్రామ మాజీ సర్పంచ్ పెద్దడ వెంకటరమణ, యువసేన సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ప్రశ్నావళి (క్విజ్) పోటీల్లో బహుమతులు సాధించారు. మంగళవారం రాష్ట్ర విద్యా పరిశోధిక శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టి) వారి ఆధ్వర్యంలో భీమునిపట్నం ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రశ్నవళి (క్విజ్) పోటీల్లో స్థానిక పాఠశాలకు చెందిన బండారు జస్వంత్ బృందం తృతీయ స్థానంలో నిలిచి ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులను, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యార్థులను, వారికి సలహాలు సూచనలు అందజేసిన కొట్టాన రాంబాబు మాస్టార్ని, ఎంఈఓ బి.పడాల్ దాస్, ఎంఈఓ-2 ఉషారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిబిటి.సుందరి, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పడాల రవికుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎఫ్ఆర్ఎస్‌కు సంబందించిన రికార్డ్, ఆరోగ్య కేంద్రం రికార్డులను, గర్భిణీలు, చిన్నపిల్లలు నమోదులను పరిశీలించారు. క్యాన్సర్ సర్వే, ఆర్‌బిఎస్‌కే సర్వేలను తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నిలవచేసే ఐఎల్ఆర్ డీప్రెజర్ టెంపరేచర్ చార్ట్‌ను పరిశీలించారు. ఇటీవల కొత్తగా నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను, రికార్డ్స్‌ను తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో 63 రకాల టెస్టులు జరగాలని సూచించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి డ్రగ్ స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు, డ్రగ్స్ పంపిణీ విధానంపై పలు సూచనలు చేసారు. పిహెచ్‌సిలో సిబ్బంది కొరతపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ఎస్ఎన్ఆర్ చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ రవికుమార్

రైతుల పక్షమా? విశాఖ డెయిరీ యాజమాన్యం పక్షమా?

- ఆనందకుమార్‌ను బిజెపిలో చేర్చుకోవడం సిగ్గు చేటు
- పాల సేకరణ ధర తగ్గించడంపై పాల రైతుల సంఘం నిరసన

నిరసన తెలుపుతున్న రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

బిజెపి రైతుల పక్షమా? లేక అవినీతికి అడ్డగా ఉన్న విశాఖ డెయిరీ యాజమాన్యం పక్షమా అనేది తేల్చి చెప్పాలని ఎపి పాల రైతుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను బిజెపిలో చేర్చుకోవడంపైనా, అర్థాంతరంగా పాల సేకరణ ధరను రూ.5 తగ్గించడంపైనా బుధవారం పాల రైతు సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రు చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ విశాఖ డెయిరీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు జరుగుతున్న సందర్భంలో చైర్మన్ ఆనంద్ కుమార్‌ని బీజేపీలు చేర్చుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. పాల సేకరణ ధర రూ.5 తగ్గించటంపై రైతుల ఆందోళన చేస్తున్నారని, దీనిపై విశాఖ వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ యాజమాన్యం అవినీతిపై రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ హౌస్ కమిటీ ఏర్పాటు చేశారని, ఇటువంటి పరిస్థితుల్లో విశాఖ డెయిరీ చైర్మన్, పదిమంది డైరెక్టర్లను బిజెపి ఎలా చేర్చుకుందని ప్రశ్నించారు. మాడుగుల, యలమంచిలి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, డెయిరీ యాజమాన్యానికి మద్దతుగా డైరెక్టర్‌తో కలిపి మాట్లాడటం హౌస్ కమిటీని ప్రభావితం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బిజెపి తన వైఖరి చెప్పాలని, తగ్గించిన పాల సేకరణ ధర పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కర్రి అప్పారావు, గాడి భూలోక నాయుడు, ఆదినారాయణమూర్తి, కృష్ణమూర్తి, గాడి అప్పారావు, కోరుమిల్లి శంకర్రావు, గండి నాయిని బాబు. రావి దేవుడు, పెంటకోట జగన్నాధరావు, ఎస్‌వి నాయుడు, సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, గొర్రెల మేకల పెంపకం దారుల సహకార యూనియన్ జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్, రైతులు పాల్గొన్నారు.

ఎపిజిఎంపిఎస్ కేలండర్ ఆవిష్కరణ

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకందారులు సంఘం 2025 కేలండర్‌ను ఎపి పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం.నాయక్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్ నాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.రజిని కుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ నాయక్ మాట్లాడుతూ గొర్రెలు మేకలు పెంపకందారులకు సంవత్సరానికి నాలుగు సార్లు డి వార్మింగ్ వేస్తామని తెలిపారు. అవసరమైన మందులు జీవాలకు ఉచితంగా వేస్తామని, దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు పెంపకం దారులు అందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎపి గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు పెంపకం దారులు సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెలు మేకలు అభివృద్ధి సహకార ఫెడరేషన్ లిమిటెడ్ రాష్ట్ర డైరెక్టర్లు, జి.ప్రకాష్ యాదవ్, మన్యాల కృష్ణ, ఎ.నాగ మల్లేశ్వరరావు, ఎవి.కృష్ణారావు, జి.అరుణమ్మ, తోడేటి గోపి, డి.వి.కృష్ణారావు, కెఎ.శ్రీనువాసులు పాల్గొన్నారు.

పాత్రికేయునికి న్యూ ప్రెస్ క్లబ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పరవాడ : న్యూ ప్రెస్ క్లబ్ సభ్యుడు, పరవాడ ఆంధ్ర ఫోకస్ రిపోర్టర్ ద్వారపూడి శ్రీనివాసరావు తండ్రి ద్వారపూడి అప్పారావు ఇటీవల మరణించిన నేపథ్యంలో బుధవారం ఆయన పెద్దకర్మ సందర్భంగా పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ తురుపున యూనియన్ అధ్యక్షులు లాలం కృష్ణారావు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ న్యూ ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్న మిత్రుల కష్టకాలంలో యూనియన్ చేదోడుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పిఎస్ నాయుడు, గౌరవ అధ్యక్షులు పరవాడ జగదీశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ పైల ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ రాజు, బండారు శరన్ కుమార్, చుక్క రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం పాల ఉత్పత్తిదారుల సొసైటీలో సంక్రాంతి పండుగ సందర్భంగా 192 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.9,12,418 సంక్రాంతి డబుల్ బోనస్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్బవరం యూనిట్ ఆఫీసర్ ఏఆర్.ప్రభాకర్, పాల సొసైటీ అధ్యక్షులు సబ్బవరపు సత్యనారాయణ (బుజ్జి) డెయిరీ చైర్మన్ ఆడాది ఆనంద్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారి చేతుల మీదుగా పాల ఉత్పత్తిదారులకు సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. అత్యధిక బోనస్ వచ్చిన ముగ్గురు పాడి రైతులకు సొసైటీ అధ్యక్షులు సొంత నిధులతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఆడారి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు సబ్బవరపు అప్పలనాయుడు, గండి శ్రీరాములమ్మ, సబ్బవరపు గంగతల్లి, వేతన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పిసిబి డిజైన్ వర్కుషాపు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఐదు రోజుల పాటు జరిగిన పిసిబి డిజైన్ వర్కుషాపు ముగిసింది. సదస్సు ముగింపు కార్యక్రమంలో డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం విద్యార్థిని విద్యార్థులకు వృత్తి నైపుణ్యాభివృద్ధి కొరకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్ ఈశ్వరరావు, డిప్లొమా ఇంచార్జి ఎన్ సరిత రాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఏ కృష్ణ నాగ్, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏఎస్ఎల్‌కే గోపాలమ్మ, ఈఈఈ డిప్లొమా విభాగాధిపతి లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

వర్కుషాప్‌లో పాల్గొన్న విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా కొండెంపూడి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట, వడ్డాది

మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఈ ఏడాదికి ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా ఎంపికైంది. బుధవారం గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి శారద జయలక్ష్మిదేవి చేతుల మీదుగా కొండెంపూడి ప్రధాన శాస్త్రవేత్త ఎన్.రాజకుమార్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల తోడ్పడుతో పాటు శాస్త్రవేత్తలు సత్తిబాబు, సౌజన్య, బాబు, రామనాయుడు, కిషోర్, రాజేష్, స్రవంతి కృషితో ఉమ్మడి విశాఖ జిల్లాలో రైతులకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కొండెంపూడి కేంద్రంగా శాస్త్రవేత్తలు రైతులకు సాంకేతిక సలహాలు, నారు మొక్కలు, పురుగుమందులు, విత్తనాలు క్షేత్ర సందర్శన, క్షేత్ర ప్రదర్శన నూతన వంగడాల తయారీ, ప్రయోగాలు వంటి వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఆరేళ్లుగా ఇక్కడ శాస్త్రవేత్తల కృషిని గుర్తించి ఎన్‌జీ రంగా యూనివర్సిటీ వారు ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను పలువురు అభినందించారు.

అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త రాజకుమార్

వెయ్యి లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలం తురకలపూడి, గొర్లెపాలెం గ్రామాల్లో చోడవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ కెవి పాపునాయుడు ఆధ్వర్యంలో బుధవారం నాటు సారా తయారీ శిబిరాలపై దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లపు పులుపును తురకలపూడి గ్రామంలో 400 లీటర్లు, గొర్లె పాలెం శివారు ప్రాంతాల్లో 600 లీటర్లను, వెరసి వెయ్యి లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పాపు నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం పులుపు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సీపట్నం పట్టణ ఎస్సై రమేష్, హెచ్ఎం కేవీ.మాధవి చేతుల మీదుగా ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, మంచి భవిష్యత్తు కోసం పాటుపడాలన్నారు. హెచ్ఎం మాధవి మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియా, ఇతర ప్రైవేట్ యాప్‌లకు అలవాటు పడుతున్నారని, వాటి నుండి దూరంగా ఉండి మంచిగా చదువుకోవాలన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నెలకొన్న భయం, ఆందోళన పోగొట్టి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని వాటి నుండి దూరంగా ఉంచేందుకే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఫలితాలు వెలువడతాయని మొదటి 15 మందికి బహుమతులు ప్రదానం చేస్తామని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు పి. విజయ్ పాల్గొన్నారు.

మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భోగి మంటల వేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు

కెజిబివిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రత్యేక అధికారి షేక్ షలీమా ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భోగిమంట వేశారు. ముగ్గులు పెట్టి రంగులు అద్దారు. సంక్రాంతి విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయుల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా ప్రధాన కేంద్రమైన పాడేరు పంచాయతీలో ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా రోడ్డు మార్జిన్లలో నిర్వహిస్తున్న కూరగాయలు దుఖాణాలను రైతు బజార్‌కు తరలించడానికి వ్యాపారులు సహకరించాలని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశము మేరకు బుధవారం ఉదయం ఈవో ఆర్డీ రమేష్‌తో కలసి రైతు బజార్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపారులకు రైతు బజార్ లో కేటాయించిన షాపులలో వ్యాపారాలు కొనసాగించాలని కోరారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని స్థానిక రైతు బజార్ ను గ్రామ పంచాయతీకు అప్పగించినందున రైతు బజార్లో అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ కూడలి రోడ్డు మార్జిన్లలో వ్యాపారాలకు అనుమతి ఇవ్వవద్దని ఆదేశించారు.

సేంద్రియ ఉత్పత్తుల అమ్మకాలు

అమ్మకాలు చేపడుతున్న మహిళలు

ప్రజాశక్తి -మాడుగుల:ప్రకృతి వ్యవసాయం విధానంలో సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులకు మాడుగుల లో మంచి స్పందన లభిస్తుంది. బుధవారం మాడుగుల శ్రీదేవి అమ్మవారి ఆలయం ఎదురుగా గ్రామస్తులు సహకారంతో ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలను, దుంప జాతి,పండ్ల జాతి ఉత్పత్తులను,చిరుధాన్యాలను అన్ని రకాల పంటను విత్తనాలను కషాయాలు అమ్మకాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.వాసులదేవరావు పాల్గొని సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలతో ప్రజలకు మరింత ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల ఇన్చార్జి గండి శ్రీనివాసరావు, దేవి, కొండాజీ, ఐసిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

సామగ్రిని దగ్ధం చేస్తున్న పోలీసులు

సారా తయారీ స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సీపట్నం రూరల్ సర్కిల్ సీఐ ఎల్ రేవతమ్మ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎస్సై పి.రాజారావు, సిబ్బంది బుధవారం నర్సీపట్నం మండలం ధర్మాసాగరం గ్రామ శివారులో నాటు సారా తయారీకి సంబంధించిన స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేశారు. సిఐ రేవతమ్మ వివరాలు ప్రకారం... నాటు సారా తయారీకి ఉపయోగించే పులుపు సుమారు 6000 లీటర్లను ధ్వంసం చేశామన్నారు. సారా తయారు చేసినా అమ్మకాలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రధాని సభకు తరలివెళ్లిన కూటమి శ్రేణులు

వాహనాలు ప్రారంభిస్తున్న పత్తిపాడు ఎమ్మెల్యే

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనలో భాగంగా బుధవారం నక్కపల్లి మండలంలో పలు గ్రామాల నుండి ప్రత్యేక బస్సుల్లో జనాన్ని తరలించారు. నక్కపల్లి నుండి విశాఖపట్నం జనాన్ని తీసుకువెళ్లే బస్సులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ జెండా ఊపి ప్రారంభించారు. బస్సులో తరలి వెళ్లే ప్రజలకు వాటర్ బాటిల్స్, ఆహారం ప్యాకెట్లను అందజేశారు. తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో డి సీతారామరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల: విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోధీ సభకు మాడుగుల మండలం నుండి 25 బస్సులు బయలుదేరాయి. శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి పిలుపు మేరకు ఎంపీడీవో ఆదేశాలతో మాడుగుల మండలంతో పాటు టౌన్ పార్టీ నాయకులు జన సమీకరణ చేసి ప్రజలను బస్సులో తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు వడ్డాది రంజిత్ వర్మ, లెక్కల కాశీబాబు,మరువాడ ఈశ్వరరావు,ధర్మశెట్టి అప్పు, జొన్నపిల్లి రమేష్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం:విశాఖపట్నంలో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు మండలంలోని టిడిపి కూటమి శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. సబ్బవరం మండల కేంద్రంలో పల్లా తాతారావు, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, పిబివిఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు బహిరంగ సభకు తరలి వెళ్లారు. పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో కూటమి కార్యకర్తలు పలు వాహనాల్లో తరలివెళ్లారు.

కశింకోట : ప్రధాని సభకు కశింకోట, తాళ్ళపాలెం నుండి జనాలను తరలించే వాహనాలను శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతుని శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, కాయల మురళీ, అప్పికొండ అప్పారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రధాని మోడీ బహిరంగ సభకు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ఎన్ఆర్ఈజీఎస్ కూలీలను భారీగా తరలి వెళ్లారు. కొణతాల పలుచోట్ల జెండాలు ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పీలా గోవింద సత్యనారాయణ, బుద్ధ నాగ జగదీష్, మల్ల సురేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మోడీ బహిరంగ సభకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు, భారీగా తరలి వెళ్లారు. వీరికి ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చినట్లు నాయకులు తెలిపారు.

పరవాడ : నరేంద్ర మోడీ బహిరంగ సభకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నాయకత్వంలో తరలివెళ్లారు. కార్యక్రమంలో కూటమి నేతలు పైలా జగన్నాధ రావు, కన్నూరు వెంకటరమణ, వియ్యపు చిన్నా, మోటూరు సన్యాసినాయుడు, బోద్దపు శ్రీనివాసరావు, బుగిడి రామ గోవిందా పాల్గొన్నారు. అలాగే గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకెలపాలెం, అగనంపూడి ప్రశాంతి నగర్, తదితర ఏరియాల నుండి వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనం తరలివెళ్లారు.

తరలిన ప్రజలు

ములగాడ : ప్రధానమంత్రి మోడీ సభకు బయలుదేరిన ఆటో ర్యాలీని జివిఎంసి 61వ వార్డు టిడిపి అధ్యక్షుడు మజ్జి సోమేష్ జెండా ఊపి ప్రారంభించారు. 58, 59 వార్డుల పరిధిలో ఉన్న టిడిపి నాయకులు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉరుకూటి పైడిరాజు, ఉరుకూటి విజయకుమార్,

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మజ్జి సోమేష్

పద్మనాభం : ప్రధానమంత్రి మోడీ సభ నిమిత్తం మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఒకటి నుంచి మూడు బస్సులు ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో మహిళలను మోడీ సభకు తరలించారు.

మకరజ్యోతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించే అయ్యప్ప మకరజ్యోతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ కోరారు. ఏటా మూడు రోజుల పాటు నిర్వహించే అయ్యప్ప మకరజ్యోతి సంబరాల సందర్భంగా బుధవారం రాజేష్ దంపతులు ముహూర్తం రాట వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 13 నుంచి 15 వరకు రోజూ ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారన్నారు. 14న సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలో స్వామి వారి రథయాత్ర ఉంటుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ గజముఖ నృత్య అకాడమీ వారిచే క్లాసికల్ నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు. రాత్రి ఏడు గంటల నుంచి బాలు రైడర్స్ వారిచే డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కనుమ రోజు పల్సర్ బైక్ రమణ ఆధ్వర్యంలో రేలారేరేలా డాన్స్ తో పాటు ఫోక్ డాన్స్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

రాట వేస్తున్న రాజేష్ దంపతులు

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

కమిటీ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్‌తో కలిసి చింతపల్లి మండల కేంద్రంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటలను చేతబోని నిరసన చేపట్టారు.నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు ఉపాధి కలిగించే జీవో 3 వెంటనే పునరుద్ధరించి డీఎస్సీలో గిరిజన యువతికు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. హైడ్రోపవర్ ప్రాజెక్టుతో గిరిజన గ్రామాలను చిన్నాభిన్నం చేయడం తగదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటివరకు చేయలేదన్నారు. గిరిజన హక్కులను కాలరాసే హక్కు ప్రభుత్వాలకు ఎవరిచ్చారని మండిపడ్డారు.గిరిజన హక్కులు, చట్టాలకు లోబడి గ్రామ సభల తీర్మానంతోనే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి పడాల్, ఆదివాసి గిరిజన సంఘం సభ్యులు మజ్జి రాంబాబు, కిల్లో సింహాచలం, చిన్నారావు పాల్గొన్నారు.

పండగ పూటా పస్తులేనా?

-వేతన బకాయిలకు గోపాలమిత్రల ఎదురుచూపులు
-ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని ఆవేదన

మూగజీవాలకు సేవలు అందిస్తున్న గోపాలమిత్ర

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాల మిత్రులకు ఆరు నెలలుగా గౌరవ వేతనాలు అందలేదు. ఆంధ్రుల ముఖ్య పండుగ సంక్రాంతి వస్తున్న తరుణంలో తమకు వేతనాలు అందని పరిస్థితుల్లో నూతన బట్టలు, పండుగ సరుకుల కొనుగోలుకు డబ్బులు లేక గోపాలమిత్రలు ఉసూరుమని చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 150 మంది గోపాలమిత్రులు, నియోజకవర్గంలో 40మంది పనిచేస్తున్నారు. నిత్యం రైతుల వద్దకు వెళ్లి సేవలందిస్తూ అరకొర ఉపాధి పొందుతూ జీవనాన్ని సాగిస్తున్న గోపాల మిత్రులకు, నెలకు ఇవ్వాల్సిన రూ.6,500 గౌరవ వేతనం కూడా ఆరు నెలలుగా ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గత వైసిపి సర్కారు చర్యలతో నిర్వీర్యమైన గోపాలమిత్ర వ్యవస్థ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గోపాల మిత్రులకు మంచి జరుగుతుందని ఆశిస్తున్నారు. కానీ సంక్రాంతి పండుగకైనా గౌరవ వేతన బకాయిలు చెల్లించే పరిస్థితి కానరాక పోవడంతో బాధను వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో నిధులొస్తాయి మీ ఖాతాలో జమ చేస్తామంటూ అధికారులు చెబుతూ వస్తున్నారని, కానీ ఇప్పటివరకు ఎటువంటి చెల్లింపులు లేవని . వాపోతున్నారు. ఆరు నెలల గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉన్నా అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదు. పనిచేస్తూ, పండగకు వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి సంక్రాంతి చేసుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు. కష్టించి పనిచేసిన తమకు ప్రభుత్వం, అధికారుల గౌరవ వేతన బకాయిలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

గొలుగొండలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

పలుచోట్ల బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి -గొలుగొండ:గొలుగొండ రెల్లి వీధిలో బుధవారం బోరు నిర్మాణ పనులను సర్పంచ్ కసిపల్లి అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ నిధులతో ఈ బోరు నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. ఈ బోరు నిర్మాణంతో ఈ ప్రాంతీయుల నీటి కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, టీడీపీ నాయకులు గుండేపల్లి రాము, మహిళలు పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట బ్రాహ్మణ వీధిలో ఉన్న వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో తాగునీటి బోర్ ఏర్పాటు పనులను బుధవారం ప్రారంభించారు. ఆలయ పరిసరాల్లో నీటి కొరతతో భక్తులకు ఇబ్బంది కలుగుతుందని ఆలయ కమిటీ స్థానిక ఎంపీటీసీ కుంచా లక్ష్మీ శంకర్ దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఎంపీటీసీ లక్ష్మి శంకర్ సుమారు రూ లక్ష మండల పరిషత్ నిధులతో తాగునీటి బోర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, మాజీ డిసిసిబి డైరెక్టర్, మాజీ కోపరేటివ్ అధ్యక్షులు గుమ్ముడు సత్యదేవ్, మండల వైయస్సార్సీపి ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు, ఎంపీటీసీ ఫ్లోర్ లీడర్ పూడి దేవా పాల్గొన్నారు.

వర్చువల్‌గా మోడీ శంకుస్థాపన

నక్కపల్లి మండలం రాజయ్యపేటలో వీక్షిస్తున్న జనం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడకలో నిర్మించ తలపెట్టిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు బుధవారం ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. ప్లాంట్ ప్రతిపాదిత స్థలంలో ప్రత్యేకమైన వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదిక వద్దకు ఎన్టీపీసీ సిఎండీ పరెన్ దాస్, కొత్తకోట ఎమ్మెల్యే బండారు సత్యానందం, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, జనసేన ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి సుందరపు సతీష్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మాజీ జడ్పీటీసీ జనపారెడ్డి శ్రీనివాసరావు, జనసేనా మండల అధ్యుడు బి రాందాస్, పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని తదితరులు పాల్గొన్నారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు లైవ్‌లో ప్రదర్శించారు. లైవ్ ప్రదర్శనలో చిన్న అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి అనేక మంది నిర్వాసితులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

నక్కపల్లి:ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖలో బుధవారం బల్క్ డ్రగ్ పార్క్ వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ ప్రసంగం, వర్చువల్ శంకుస్థాపన స్థానిక ప్రజలు తిలకించేందుకుగాను మండలంలోని రాజయ్యపేట సమీపంలో వర్చువల్ సభను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు కారిడార్ కోసం భూసేకరణ జరిగిన గ్రామాల నుండి నిర్వాసితులను బస్సులో ఎక్కించి సభా స్థలం వద్దకు తీసుకువచ్చారు. మోడీ ప్రసంగం, బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన నిర్వాసితులు తిలకించేందుకుగాను డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలలో వచ్చిన నిర్వాసితులు మోడీ ప్రసంగం కొంతసేపు తిలకించి, సమావేశం జరుగుతుండగానే చాలామంది వెనుదిరిగారు. పలువురు అధికారులు పర్యవేక్షించారు.

కెజిబిని సందర్శిస్తున్న వైద్యులు

విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మండలం వేములపూడి కస్తూర్బా పాఠశాలలో ఆహారం తిని పలువురు విద్యార్థులు వాంతులు, విరోచనాల బారినపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు బుధవారం కస్తూరిబా పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందజేశారు. అస్వస్థతకు గురైన ఆరుగురు విద్యార్థులకు వైద్య సేవలు అందించడంతో వీరు కోలుకున్నారు. ఇద్దరు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ముందు జాగ్రత్తగా నర్సీపట్నంలోని ఒక ప్రైవేట్ హాస్పటల్ కి తల్లిదండ్రులు తరలించారు. ప్రస్తుతం ఈ విద్యార్థుల ఆరోగ్యం నిలకడగానే ఉందని ప్రైవేట్ ఆస్పత్రి వైద్య విభాగం తెలియజేశారు.

హాజరైన అధికారులు, నాయకులు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా గడిచిన నెల రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. జల్లూరు గ్రామంలో స్థానిక సర్పంచ్ పద్మావతి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. 7 ఫిర్యాదులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ ఊర్ధవరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారి పెద్దన్న దొర పాల్గొన్నారు.

ప్రధాని మోడీ పర్యటన పదనిసలు

విశాఖపట్నంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసేందుకు వచ్చిన ప్రధాని మోడీ పర్యటన ఉత్సాహంగా సాగింది. ప్రధానిమోడీతోపాటు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఎపి బిజెపి చీఫ్ పురందేశ్వరి ఓపెన్‌టాప్ వాహనంలో రోడ్‌షోకు ప్రజలు పువ్వులు చల్లుతూ, నినాదాలు చేస్తూ స్వాగతించారు. అనంతరంఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో 2.08లక్షల కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

మోడీని తోడ్కొని వస్తున్న బాబు, పవన్

రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తూ, సాగుతున్న ప్రధాని మోడీ

ప్రధాని మోడీతో చంద్రబాబు సమాలోచనలు

ప్రధానికి జ్ఞాపికను బహూకరిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ప్రధాని రోడ్‌షోలో ప్రజలు... సభలో నేతలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రధాని సభలో పాల్గొన్న నేతలు

ప్రధాని సభకు జనసమీకరణకు వచ్చిన ఆర్‌టిసి, ప్రయివేటు బస్సులు